


ఉట్కూరులో వ్యక్తిని కొట్టి చంపిన ఘటనపై సీరియస్.. ఎస్సై సస్పెండ్


PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd





పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 168 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- శనివారం 15 జూన్ 2024






# ద్వైపాక్షిక బంధం బలోపేతమే లక్ష్యం

**బ్రిటన్,జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫ్రాన్స్, ఉక్రెయిన్ నేతలతో మోడీ చర్చలు అపూలియా, ఇటలీ : ద్వైపాక్షిక సంబంధాలను, పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా, ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లదిమిర్ జెలెన్స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌లతో విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు.జి–7 సదస్సు నేపథ్యంలో ఈ భేటీలు చోటు చేసుకున్నాయి. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా మోడీ జరుపుతున్న విదేశీ పర్యటన ఇది. రష్యా, ఉక్రెయిన్ ఘర్షణలకు సంబంధించిన వివిధ అంశాలపై మోడీకి జెలెన్స్కీ వివరించారు. చర్చలు, దౌత్య పరిష్కారాల ద్వారా మాత్రమే సమస్యను పరిష్కరించుకోవాలన్నది భారత్ వైఖరని మోడీ స్పష్టం చేశారు. గతేడాది మేలో హిరోషిమా సదస్సులో కూడా జెలెన్స్కీతో మోడీ భేటీ అయ్యారు.భారత్, బ్రిటన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకై చర్యలు తీసుకోవడానికి మోడీ, రిషి సునాక్ తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. "రక్షణ, భద్రత, వాణిజ్యం, ఆర్థిక సహకారం, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను ఇరువురు నేతలు సమీక్షించారు. 2030 వరకు అనుసరించాల్సిన ప్రణాళిక అమలుపై చర్చించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల్లో పురోగతిని సమీక్షించారు." అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.రక్షణ, అణు, రోదసీ రంగాల్లో ఫ్రాన్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి గల మార్గాలపై మాక్రాన్‌తో మోడీ చర్చించారు. కీలకమైన అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త స్థాయిలకు తీసుకెళ్లాలని ఇరుపక్షాలు నిర్ణయించాయని జైస్వాల్ తెలిపారు.

## సుల్తానాబాద్ అత్యాచార ఘటనపై సీఎం సీరియస్..

### ● డీజీపీకి కీలక ఆదేశాలు

**నారాయణ పేట,జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి జిల్లాల్లో జరిగిన హత్యాచారం, భూతగాదా హత్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల బాలికపై అత్యాచారం, హత్యపై సీఎం తీవ్రంగా స్పందించారు.పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీసులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. నారాయణ పేట జిల్లాలో సంజీవ్ అనే వ్యక్తిని కొట్టి చంపిన ఘటనపై సీఎం ఆరా తీశారు. అరచకాలు, హత్యలకు పాల్పడే వారెవరైనా ఉపేక్షించవద్దని సీఎం రేవంత్ అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు.

## మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టు నోటీసులు




**సిరిసిల్ల,జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బీఆర్ఎస్ నేత కల్లకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కు శుక్రవారం హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ప్రతివాదులైన కేటీఆర్, కేంద్రఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి, రిటర్నింగ్ అధికారి అయిన ఆర్డీవోలు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.కేటీఆర్ ఎన్నిక చెల్లందంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన కేకే మహేందర్‌రెడ్డి, లగిశెట్టి శ్రీనివాసులు అనే వ్యక్తి విడివిడిగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు వెల్లడించారు.అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ దాఖలు చేసిన నామినేషన్ డాక్యుమెంట్స్‌లో ఆయన కొడుకు కె. హిమాన్షు పేరిట ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పలేదని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు. కేటీఆర్ ఎలక్షన్ అఫిడవిట్లో తనపై భార్య, మైనర్ కుమార్తెలే ఆధారపడ్డారని

వివరాలు 2లో

## యడ్యూరప్పకు ఊరట

**బెంగళూరు,జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** తదుపరి విచారణ వరకూ అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశం బెంగళూరు : పోక్సో చట్టం కింద నమోదైన కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్పకు ఆ రాష్ట్ర హైకోర్టు ఊరట కలిగించింది.తదుపరి విచారణ వరకూ అరెస్టు చేయవద్దని పోలీసుల్ని శుక్రవారం ఆదేశించింది. 17 ఏళ్ల బాలికపై వేధింపుల కేసులో యడ్యూరప్పకు వ్యతిరేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టు (పోక్సో కోర్టు) గురువారం సాయంత్రం నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ చట్టబద్ధతను ప్రశ్నిస్తూ ఒక పిటీషన్‌ను, సెషన్ కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంట్ ఆధారంగా తనను అరెస్టు చేయవద్దని కోరుతూ మరొక పిటీషన్‌ను హైకోర్టులో ఆయన దాఖలు చేశారు. ఈ పిటీషన్లను శుక్రవారం జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్ విచారించారు. ఈ కేసు విచారణ కోసం సిఐడి ముందు యడ్యూరప్ప హాజరైన విషయాన్ని, విచారణకు సహకరించిన విషయాన్ని కోర్టు గుర్తించింది. 17న సిఐడి ముందు విచారణకు హాజరవుతానని యడ్యూరప్ప తెలిపిన విషయాన్ని ప్రస్తావించింది. దీంతో తదుపరి విచారణ వరకూ యడ్యూరప్పను అరెస్టు చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.2012 ఫిబ్రవరిలో సహాయం కోరి తన తల్లితోపాటు వచ్చిన 17 ఏళ్ల బాలికపై యడ్యూరప్ప తన నివాసంలోనే లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే.




## కువైట్ అగ్ని ప్రమాదం: బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటన



**హైదరాబాద్,జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కువైట్ అగ్నిప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఏపీకి చెందిన ముగ్గురు కార్మికులు చనిపోగా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు.కాగా మొత్తం 45 మంది భారతీయులు ఈ ప్రమాదంలో చనిపోగా వారి మృతదేహాలు ఇవాళ స్వదేశానికి చేరుకున్నాయి.

## బక్రీద్ సందర్భంగా నాలుగు రోజులు సెలవులు



**హైదరాబాద్,జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు చాలా పవిత్రంగా జరుపుకుంటారు. ఆ రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటిస్తుంది.అయితే ఈ ఏడాది బక్రీద్ కు ఏకంగా నాలుగు రోజులు సెలవులను ప్రకటించారు. అయితే ప్రభుత్వం మాత్రం బక్రీద్ నాడు మాత్రమే సెలవును ప్రకటించింది.బక్రీద్ సందర్భంగా హైదరాబాద్‌లోని పలు పాఠశాలలకు నాలుగు సెలవులు ప్రకటించారు. జూన్ 15 నుంచి 18 వరకు చాలా ప్రైవేట్ పాఠశాలలు సెలవులు ప్రకటించాయి. అయితే తెలంగాణ సర్కారు మాత్రం ఒక్కరోజు మాత్రమే సెలవు ప్రకటించింది.బక్రీద్ సెలవుల అనంతరం హైదరాబాద్‌లోని పాఠశాలలు జూన్ 19న పునఃప్రారంభం కానున్నాయి.హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు బక్రీద్‌కు జూన్ 17 సోమవారం సెలవు.ఇస్లామిక్ చాంద్రమాన క్యాలెండర్‌లో 12వ నెల అయిన దుల్ హిజ్జా 10వ తేదీన బక్రీద్ జరుపుకుంటారు. మసీదులు, ఈద్గాలలో నమాజ్ చేసిన తర్వాత వేడుకలు ప్రారంభమవుతాయి.

## నీట్ అవకతవకలపై కేంద్రం, ఎన్‌టిఏకు సుప్రీం నోటీసులు



### ● సత్వరమే సిబిఐ దర్యాప్తునకు ఆదేశించండి: పిటిషనర్ల అభ్యర్ధన వచ్చేనెల 8న విచారణ

**న్యూఢిల్లీ,జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** నీట్ పరీక్షలో అవకతవకలపై రిటైర్డ్ సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి చేతకానీ లేదా దర్యాప్తు సంస్థతో కానీ సత్వరమే విచారణ జరిపించాలన్న పిటిషనర్ల అభ్యర్థనపై సుప్రీంకోర్టు కేంద్రానికి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)కి శుక్రవారం నోటీసులు జారీ చేసింది.ఈ వ్యవహారంపై సత్వరమే సిబిఐ చేత దర్యాప్తు జరిపించాల్సిన అవసరముందని పిటిషన్‌దారులు పేర్కొన్నారు. దీనిపై జులై8న విచారణ చేపట్టనున్నట్లు న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన వెకేషన్ బెంచ్ తెలిపింది. అయితే జులై6 నుంచి జరిగే కౌన్సెలింగ్‌ను ఆపాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీం తిరస్కరించింది. దీనిపై సత్వరమే సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలన్న పిటిషనర్ల వాదనపై జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందిస్తూ " వారి పరోక్షంలోనే సిబిఐ దర్యాప్తు ఆదేశాలు జారీ చేయగలమా? ఇదేనా మీ వాదన? మీరు కోరిన రిలీఫ్‌ను తిరస్కరించడం లేదు. కానీ ముందుగా వారి స్పందనను కూడా తెలుసుకుందాం." అని చెప్పారు.

వివరాలు 2లో

# మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారని, అయితే, గత ఏడాది జులైలో మేజర్ అయిన హిమాన్షు తనపై ఆధారపడలేదని కూడా చెప్పారని వివరించారు. హిమాన్షు సిద్ధిపేట మర్కూక్ మండలం వెంకటాపూర్‌లో నాలుగు 4 ఎకరాలు, ఎర్రబల్లిలో 32.15 ఎకరాలు కొనుగోలు చేసినందుకు వరసగా రూ.10.50 లక్షలు, రూ.88 15 లక్షలు చెల్లించారని, కేటీఆర్ అర్థిక అండ లేకుండా ఇటీవలే మేజర్ అయిన కొడుకుకు అంత డబ్బు ఎలా వస్తుందన్నారు.తండి ఆర్థిక సాయం లేకుండా అంత మొత్తాన్ని హిమాన్షు ఎలా చెల్లించగలరని ప్రశ్నించారు. ఎలక్షన్ అపిడవిట్లో నిజాలు చెప్పకుండా చేయడం ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123కు విరుద్ధమని, రుక్మిణి మాదగౌడ వర్సెస్ కేంద్ర ఎన్నికల సంఘం కేసులో సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకమన్నారు. వాదనల అనంతరం న్యాయమూర్తి, ప్రతివాదులైన కేటీఆర్, ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులు కౌంటర్ దాఖలు చేయాలంటూ నోటీసులు జారీ చేశారు తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేశారు.

# నీట్ అవకతవకలపై కేంద్రం, ఎన్‌టిఎకు సుప్రీం నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

రికార్డు సంఖ్యలో విద్యార్థులు కచ్చితమైన స్కోర్లను సాధించడంతో సిబిఐ దర్యాప్తు కావాలని చివరకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) జూనియర్ డాక్టర్ల నెట్‌వర్క్ కూడా డిమాండ్ చేస్తోందని పిటిషనర్లలో ఒకరి తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది చారూ మాథూర్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు కూడా నీట్ ఫలితాలపై దర్యాప్తును కోరుతున్నాయన్నారు. ఇదంతా చూస్తుంటే అక్రమాలు, అవకతవకలు జరిగాయని స్పష్టమవుతోందని పిటిషనర్లు ఆర్ష్ సమీర్ వ్యాస్ తదితరులు పేర్కొన్నారు. ఒఎంఆర్ షీట్‌లతో పోలిస్తే విద్యార్థులకు వారి స్కోర్‌కార్డులపై వివిధ మార్కులు వచ్చాయని, అనూహ్యమైన రీతిలో కటాఫ్ మార్కులు, సగటు మార్కులు పెరిగాయని, ఫలితంగా గతంలో ఎన్నడూలేని రీతిలో 67మంది అభ్యర్థులకు 720 మార్కులకు గాను 720 రావడం ఎలా సాధ్యమని వారు తెలిపారు. వీరిలో ఆరుగురు టాపర్లు హర్యానాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన వారేనని వివరించారు. మరికొంతమందికి 718, 719 మార్కులు వచ్చాయి, అవి కూడా గణాంకాలపరంగా ప్రశ్నార్థకంగానే వున్నాయి, అసలు సమయాన్ని కోల్పోయినందుకు నష్టపరిహారంగా ఏ పద్ధతిని అనుసరించారు, దానికి గల ప్రామాణికాలు ఏమిటన్న విషయాలు వెల్లడించలేదని పిటిషనర్లు పేర్కొన్నారు.వివిధ హైకోర్టుల్లో పెండింగ్‌లో వున్న పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాల్సిందిగా కోరుతూ ఎన్‌టిఎ కూడా సుప్రీంను ఆశ్రయించింది. దానిపై కూడా బెంచ్ నోటీసులు జారీ చేసింది.

# పథకాలకు కొత్త పేర్లు

**- పింఛన్ల పేరుతో మార్పు ప్రారంభం**

**ఉన్నతాధికారులతో సిఎం పేషీ మంతనాలు**

**అమరావతి, జూన్ 14(పిసిడబ్ల్యూ న్యూస్) :**రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అనేక పథకాలకు పేర్లు మార్పు ప్రారంభమైరది.సామాజిక పింఛన్ల పథకాన్ని ఎన్‌టిఆర్ భరోసాగా మార్చడంతో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. కొద్ది రోజుల్లోనే ఇతర పథకాలకు కూడా పేర్ల మార్పు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టిఆర్ పేరు సాధ్యమైనన్ని ఎక్కువ పథకాలకు పెట్టాలని ఇప్పటికే నిర్ణయించినట్లు సమాచారం. దీనివల్ల కూటమి లోని భాగస్వామ్య పార్టీల నుండి కూడా అభ్యంతరాలు ఉండవని భావిస్తున్నారు వైఎస్‌ఆర్ చేయూత, జగనన్న అమ్మ ఒడి, జగనన్న ఇళ్లు, వైఎస్‌ఆర్ ఆసరా, వైఎస్‌ఆర్ కాపు నేస్తం, వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, వైఎస్‌ఆర్ ఈబిసి నేస్తం, వైఎస్‌ఆర్ మత్స్యకార భరోసా, జగనన్న విద్యాదీవెన, వైఎస్‌ఆర్ వాహనమిత్ర, వైఎస్‌ఆర్ లా నేస్తం, వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం, వైఎస్‌ఆర్ రైతు భరోసా, వైఎస్‌ఆర్ జలకళ, వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ తదితర పథకాల పేర్లు మార్చాలని భావిస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు త్వరలోనే సిఎంఓ కార్యాలయం జారీ చేయనున్నారు. వైద్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరును మళ్లీ పునరుద్ధరిరచనున్నారని సమాచారం.

# ధరణి పెండింగ్ దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలి

**● సీసీఎల్ నవీన్ మిత్తల్**



**కొత్తగూడెం జిల్లా, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**ధరణి పెండింగ్ దరఖాస్తులపై శుక్రవారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట నల్గొండ జిల్లా కలెక్టర్లతో సీసీఎల్ నవీన్ మిత్తల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి? తాజా దరఖాస్తులు ఎన్ని వచ్చాయి? ధరణి సమస్యల సమగ్ర వివరాలను సీసీఎల్ నవీన్ మిత్తల్ కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యల పరిష్కరించేందుకు చేపట్టాల్సిన మార్గాలపై ఆయన తగిన సూచనలు చేశారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులన్నిటిని వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ జిల్లాలో 3851 ధరణి దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, జిల్లా యంత్రాంగమంతా పార్లమెంట్ మరియు పట్టభద్రుల ఉప ఎన్నిక ల విధుల్లో నిమగ్నమై ఉన్నందువలన దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల్లో 80 శాతం విచారణలు పూర్తి అయినయని, మిగిలిన 20 శాతం రానున్న రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో దరఖాస్తులను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ నందు అనంతరం కలెక్టర్ ఆర్డీవోలు, తాసిల్దార్లతో ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ దరఖాస్తులన్నిటిని త్వరితగతిన విచారణ జరిపి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. రానున్న వారం రోజుల్లో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రవీందర్ నాథ్, ఆర్ డి ఓ లు మధు, దామోదర్ రావు ,అన్ని మండలాల తాసిల్దార్లు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాల నెపంతో దాడి చేసిన వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**● చార్వాక - ఎస్ఎస్ఎఫ్**



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 14(పిసిడబ్ల్యూ న్యూస్) :**జనగామ జిల్లాలో నర్మెట్ట మండల కేంద్రంలో నక్కల సత్తెమ్మ అనే మహిళ పైన బంధువులు నక్కల రవి మంత్రాలు చేస్తున్నారని నెపంతో బుధవారం అర్ధరాత్రి గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నక్కల రవి తన భార్య మరియు తన పిల్లలు ఈ మధ్య తరచూ అనారోగ్యానికి గురి కావడంతో దానికి కారణం తన సమీప బంధువులైన నక్కల సత్తమ్మ తరచూ వారి ఇంటికి వస్తుండడం నక్కల సత్తమ్మ తన భార్య పిల్లలకు మంత్రాలు చేసి అనారోగ్యానికి గురయ్యేట్టు చేసిందని నమ్మి నక్కల రవి మహిళ పైన దాడి చేశాడు. మంత్రాలు మహిమలు అంటూ ఏవీ లేవని వాటిని నమ్మి ప్రజలు మోసపోవద్దని ఈ సందర్భంగా సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ తరపున పిలుపునిస్తున్నాం. మనలో ఉన్న అజ్ఞానమే మంత్రాలు మహిమలు నమ్మి శారీరకంగా ఆర్థికంగా మానసికంగా మోసపోవడమే కాకుండా ఇటువంటి భౌతిక దాడులకు సైతం చేసే విధంగా విచక్షణ కోల్పోతారని ఎస్ఎస్ఎఫ్ జాతీయ సమన్వయకర్త చార్వాక అన్నారు. ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించాల్సినటువంటి బాధ్యత ప్రభుత్వాన్ని ది మరియు ప్రభుత్వ అధికారుల పైన ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలు మూఢనమ్మకాల బారిన పడి ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం వెంటనే మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని తీసుకువచ్చి అసెంబ్లీలో ఆమోదించి వెంటనే ఆచరణలో పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వెంటనే సంఘటన జరిగిన మండల కేంద్రంలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి మూఢనమ్మకాల పట్ల మంత్రాలు మహిమల పట్ల ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా పోలీసులు సైతం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

# మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి

**● డిసియంస్ చైర్మన్ కొత్వాల**

**కొత్తగూడెం , జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**పాల్వంచ మున్సిపాలిటీ లో చాలీ చాలని జీతాలతో గత 25 సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ కార్మికులుగా పని చేస్తున్న కార్మికుల వేతనాలను పెంచేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలనీ డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమీషనర్ ఏ. స్వామికి కొత్వాల తో పాటు కార్మికులు, కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటురతున్న తరుణం లో కార్మికులకు చెల్లించే చాలీ చాలని జీతాలతో వారి కుటుంబాలు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి, వేతనాలు పెంచేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలని కొత్వాల కోరారు. మున్సిపల్ కమీషనర్ ఏ. స్వామి, ఏ. ఈ. రాజేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ రావు, పాల్వంచ మాజీ జెడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, ఔట్ సోర్సింగ్ కార్మికులు, బి.నరేష్, ఎస్.కె. అక్బర్, ఎస్. కె. జాని, పవన్, రామజోగి, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, కాపర్తి వెంకటాచారి, మాలోత్ కోఠి నాయక్, పైడిపల్లి మహేష్, మస్నా శ్రీనివాస్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# జులై 7న వరంగల్లో జరిగే మాదిగా ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయండి

**● ఎంఎస్‌పి అధికార ప్రతినిధి అలవాల రాజా పెరియార్**



**కొత్తగూడెం, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**భద్రాచలం కేంద్రంలోని స్థానిక ఆదర్శ్ నగర్ కాలనీ నందు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఎంఎస్ అనుబంధ సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్మ గిరి వెంకటేశ్వర్లు మాదిగ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అలవాల రాజా పెరియర్ పాల్గొని మాట్లాడుతూ జులై 7న ఎమ్మార్పీఎస్ 30 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వరంగల్ లో నిర్వహించబోతున్న ఆత్మగౌరవ కవాతుని జయప్రదం చేసేందుకై ప్రతి ఒక్క ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఎంఎస్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు వ్యక్తిగత బాధ్యత తీసుకొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. మహా జననేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపులో భాగంగా నూతన కమిటీల నిర్మాణాన్ని గ్రామ, మండల, వార్డు, కాలనీపరిధిలో మనకున్న వివిధ విభాగాలకు నూతన కమిటీలు ఈనెల 21 వరకు నిర్మాణం చేపట్టాలని,ఈనెల 22న గ్రామం ,వార్డు, కాలనీ పరిధిలో సన్నహక కవాతులు నిర్వహించాలని,ఈనెల 23 నుండి ఈ నెల 30 వరకు పట్టణ,మండల కమిటీలను పూర్తి నిర్మాణం చేపట్టాలని,జులై 1న పట్టణ,మండల సన్నహక కవాతులు నిర్వహించాని ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ ఎఫ్, ఎం ఈ ఎఫ్, ఎం ఎల్ ఎఫ్, ఎం ఎం ఎస్, ఎం జె ఎఫ్, ఎంకేఎం లతో బాటు మనకున్న అన్ని విభాగాలకు జులై 3న పూర్తిస్థాయి జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని,జులై 5న అన్ని జిల్లా కేంద్రాల్లో కనీసం 2 కె ఎం ల వరకు తగ్గకుండా జిల్లా కేంద్రంలో అత్యంత ప్రధాన కూడలిలో అన్ని విభాగాలకు చెందిన వేలాది మందితో సన్నాహక కవాతులు నిర్వహించాలని.జులై 6న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు చేయాలని. ఇప్పటివరకు జెండా ఆవిష్కరణలు చేయని గ్రామాల్లో వెంటనే నూతనంగా జెండా దిమ్మెలు వేసుకొని జెండా ఆవిష్కరణ జరపాలని,అందుకోసం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఎంఎస్ నాయకత్వం ప్రతి గ్రామంలో పర్యటించాలని, జూలై 7 న ఛలో వరంగల్ కి మన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో డ్రెస్ కోడ్ తో వరంగల్ కు తరలి రావాలని,క్రమశిక్షణతో ఆత్మగౌరవ కవాతును నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహాజన మహిళా సమైక్యఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మేకల లత మహాజన్, జిల్లా అధికార ప్రతినిధి తెల్లం సమ్మక్క మహాజన్, కంచర్ల కుమారి మహాజన్, మాదిగ మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి గుండె సుహాసిని మాదిగ, జిల్లా ఉపాధ్యక్షురాలు వేల్పుల సూర్యవాణి మాదిగ, కార్యదర్శి కొప్పుల నాగమణి మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కోట ప్రభాకర్ మాదిగ, పట్టణ ఉపాధ్యక్షులు పింగిలి నాగరాజు మాదిగ, బచ్చులకూరి జానీ తదితరులు పాల్గొన్నారు.

# ఉట్కూరులో వ్యక్తిని కొట్టి చంపిన ఘటనపై సీరియస్.. ఎస్సై సస్పెండ్

**ఉట్కూరు,జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూవివాదం కారణంగా నారాయణపేట జిల్లా ఉట్కూరులో సంజీవ్ అనే వ్యక్తిని కొట్టి చంపిన ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. భౌతిక దాడులకు దిగి అరాచకాలు, హత్యలకు పాల్పడే శక్తులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే, అక్కడి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉట్కూరు ఎస్సై బిజ్జ శ్రీనివాసులును సస్పెండ్ చేశారు.శాంతి భద్రతలను పరిరక్షించడంలో విఫలమైనందున శ్రీనివాసులును సస్పెండ్ చేసినట్లుగా జిల్లా ఎస్పీ యోగేశ్ గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతలను కాపాడటంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, భూ తగాదా కేసులో సంజీవ్‌పై దాడి చేసిన నలుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు.ఉట్కూరు మండలం చిన్నపొర్ల గ్రామానికి చెందిన సంజీవ్ అనే రైతు జీవనోపాధి కోసం గ్రామం విడిచి కుటుంబంతో సహా హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. ఇటీవల వర్షాలు కురవడంతో తనకు ఉన్న నాలుగు ఎకరాలను సాగు చేసేందుకు తాజాగా గ్రామానికి వెళ్లాడు. కాగా, అప్పటికే దాయాదులతో భూ తగాదాలు ఉండటంతో గ్రామానికి వచ్చిన సంజీవ్‌తో గొడవకు దిగారు. మాటామాట పెరగడంతో సంజీవ్‌పై దాయాదీలు కర్రలతో దాడికి దిగారు. సంజీవ్ భార్య, గ్రామస్థులు ఎంతగా అడ్డుకున్నప్పటికీ వినిపించుకోకుండా దారుణంగా చితకబాదారు. తీవ్రంగా గాయపడిన సంజీవ్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, దాడి జరుగుతున్న సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యం వహించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డయల్ 100కి ఫోన్ చేసిన రెండు గంటల తర్వాత పోలీసులు ఘటనాస్థలికి వచ్చారని తెలిపారు.అదును చూసుకుని వాళ్లు సంజీవ్‌పై కర్రలతో దాడికి దిగారు.



# పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**● సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ ● ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి ● జిల్లాలో ఉన్న భూముల మార్కెట్ విలువ రిపోర్ట్ సమర్పించాలి**



**మహబూబాబాద్ జిల్లా, జూన్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** పెండింగ్ ధరణి దరఖా స్తులను సత్వరమే పరిష్కరించాలని సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, రెవెన్యూఅదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. సీసీఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసిల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పరిష్కరించా లని అన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు. ధరణి వెబ్ సైట్ సంబంధించి జీఎల్ ఎం, టిఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసిల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారి, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నా మని అన్నారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని సిసిఎల్ఏ కమీషనర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని, మార్కెట్ విలువ నమోదులో ఎక్కడా స్థానికంగా ఎటువంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. సీసీఎల్ఏ నుంచి జిల్లా కలెక్టర్లకు రిటర్న్ వచ్చిన దరఖాస్తులలో అధికంగా ఆర్.ఎస్.ఆర్ దరఖాస్తులు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు జత చేయని దరఖాస్తులు ఉంటాయని అన్నారు. ఆర్ఎస్ఆర్ దరఖాస్తులలో తప్పుడు ఎంట్రీ జరిగిందా ధ్రువీకరించి, తప్పుడు ఎంట్రీని తొలగించి , ఆర్ఎస్ఆర్ సవరణకు రిపోర్టుతో సహా దరఖాస్తులు పంపాలని కలెక్టర్లకు సీసీఎల్ ఏ కమీషనర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, జిల్లాలో అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారుల,తహసిల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి త్వరలో పరిష్కరిస్తామని అన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లాకలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ,లి ప్రతి మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ ధరణి దరఖాస్తులను స్కానింగ్ చేసేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేసుకోవాలని, మండలం లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించేందుకు రోజువారి లక్ష్యాలను కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మహబూబాబాద్, తొర్రూ రు ఆర్డీఓ లు ఎల్.అలివేలు, నరసింహరావు కలెక్టరేట్ పర్యవే క్షకులు భద్రకాళి, రమణి, వివిధ మండలాల తహసీల్దార్ లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**● వినియోగదారులు సహకరించాలి**

**● కురవి మండల విద్యుత్ ఎఇ శారద**



**కురవి, జూన్ 14 : కురవి(పి.సి.డబ్ల్యు న్యూస్):** మండలంలోని అయ్యగారిపల్లి విద్యుత్? సబ్? స్టేషన్? లో ( మెంటనెన్స్? ) మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అంతరాయం కలుగుతుందని, అందుకు వినియోగదారులు సహకరించాలని కురవి మండల విద్యుత్ ఎఇ శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యగారిపల్లి, మోదుగులాగూడెం, నల్లెల్ల, తిరుమలాపురం, కురవితో పాటు చుట్టూ ఉన్న తండాలకు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్? వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

## ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**● భూ పరిపాలన చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్**






**హనుమకొండ ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని జిల్లాల లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను త్వరగా ఎలాంటి తప్పిదాలు జరగకుండా వాటిని పరిష్కరించాలంటూ శు క్రవారం హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ పరిపాలన చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. సీ.సీ.ఎల్.ఏ మాట్లాడుతూ.. భూముల మార్కెట్ ధరలను సవరించడానికి మండలాల పరిధిలో ఆర్డిఓ చైర్మన్ గా తహసిల్దారులు, ఎంపీడీవోలు , సబ్ రిజిస్ట్రార్లు సభ్యులుగా కమిటీలు ఏర్పాటు చేయాలని అలాగే పట్టణ ప్రాంతాలలో అదనపు కలెక్టర్లు చైర్మన్ , మున్సిపల్ కమిషనర్లు , తహసిల్దార్లు , జడ్పీ సీ.ఓలు సభ్యులు గా కమిటీల ఏర్పాటు చేయాలని అదేవిధంగా జిల్లా కలెక్టర్ చైర్మన్ గా అనామలీస్ కమిటీ ఏర్పాటు చేయాలని దీనిలో అదనపు కలెక్టర్లు , ఆర్డీవోలు , తహసిల్దారులు , రిజిస్ట్రార్లు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీలను త్వరగా ఏర్పాటు చేసి భూముల మార్కెట్ ధరలను సవరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్ రెడ్డి , డిఆర్ఓ వై.వి గణేష్ , ఆర్డీవోలు పరకాల , వరంగల్ వెస్ట్ నారాయణ, వెంకటేశ్వర్లు మరియు సంబంధిత తహసిల్దార్లు అధికారులు పాల్గొన్నారు

## పురుషోత్తం రెడ్డికి ఘన నివాళులు..



**హనుమకొండ ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ హంటర్ రోడ్డులోని సిఎస్ఆర్ గార్డెన్ నందు ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి అన్న వేం పురుషోత్తం రెడ్డి సంవత్సరికం లో మంత్రులు కొండా సురేఖ, దానసరి అనసూయ ( సీతక్క), పొన్నం ప్రభాకర్, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ తో కలిసి పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ సందర్భంగా పురుషోత్తం రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజ్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు , ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా ,మండల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ముస్లిం నేతలు



**భూపాలపల్లి , జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆకర్షణ పథకాలకు ఆకర్షితులై భూపాలపల్లి అభివృద్ధి ప్రదాత నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నాయకత్వాన్ని బలపరుస్తూ శుక్రవారం జిల్లా పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు మహమ్మద్ యాకుబ్, భూపాలపల్లి మండల పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యులు తాజా మాజీ ఉప సర్పంచ్ మొహమ్మద్ మైనోద్దీన్ ఆధ్వర్యంలో గొర్ల వీడు మజీద్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గౌరవ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో సుమారు 100 మంది ముస్లిం మైనార్టీ సోదరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరితో పాటు గొర్లవీడు యాదవ సంఘం అధ్యక్షులు మామిడి రాజ్ కుమార్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరినారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ ఫాజిల్, గణపురం మండల కో ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ చోటే మియా, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ ఇర్ఫాన్, మైనార్టీ టౌన్ అధ్యక్షులు మొహమ్మద్ హైమద్, జిల్లా యూత్ నాయకులు మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ సాబీర్ ఖాన్ తదితరులున్నారు.

## ప్రజల వినతులు స్వీకరించిన మంత్రి కొండా సురేఖ

**హనుమకొండ ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండలోని రాంనగర్ లోని తన నివాసంలో మంత్రి కొండా సురేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గురువారం ఓ సిటీలోని క్యాంప్ ఆఫీసులో వందలాదిగా వచ్చిన ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన మంత్రి సాధ్యమైనంత వరకు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు. కాగా శుక్రవారం మంత్రి నివాసంలోనూ ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సే పరమావధిగా ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటానని, తాను హైదరాబాద్ లో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో వుండాలని, వీలైన వారు తనను హైదరాబాద్ లో కలవాలని మంత్రి సురేఖ సూచించారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్ లోని తన నివాసంలోనూ, హైదరాబాద్ సెక్రటేరియట్ కార్యాలయంలోనూ తాను అందుబాటులో ఉంటానని మంత్రి సురేఖ ప్రజలకు తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




**రేగొండ ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మృతుడు పులి రవి తండ్రి పేరు మల్లయ్య,63 సంవత్సరాలు, సింగరేణి ఎంప్లాయ్, ముచింపుల గ్రామం,నల్లబెల్లి మండలం, వరంగల్ జిల్లా. తన ప్యాషన్ ప్రో బండి మీద 15 9826 గోదావరిఖనికి వెళ్లి తిరిగి వస్తుండగా రంగయ్యపల్లి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు 1428, డ్రైవర్ వివరాలు:మధ్యల రవీందర్ తండ్రి పేరు ఐలయ్య, లింగాల గ్రామం, పరకాల డిపో అతివేగంగా,అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి గుద్దగా తీవ్రమైన రక్త గాయాలు అయినాయి వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డ్యూటీ డాక్టర్ మరణించినాడని తెలిపినాడు. ఫిర్యాదురాలు మృతుని భార్య ప్రేమలత ఫిర్యాదు మేరకు, రవికుమార్ గారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆనంద్ మోజెస్‌ని పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హనుమకొండ ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సెయింట్ పాల్స్ స్కూల్ చైర్మన్ ఆనంద్ మోజెస్ అనారోగ్యంతో అస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అస్పత్రికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అస్పత్రి వైద్యులను ఆనంద్ పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందే విధంగా చూడాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు తదితరులు ఉన్నారు.



# స్పందించిన మిషన్ భగీరథ అధికారి

● పిసిడబ్ల్యూ న్యూస్ ఎఫెక్ట్






PCW తెలుగు దినపత్రిక

## వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

మరిపెడ, జూన్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):గ్రామాలలో నీళ్లు లేక అల్లాడిపోతుంటే జనాలు ఇక్కడ మాత్రం నీళ్లు వృధాగా రోడ్డు మీద పార్లిపోతున్నాయి మరిపెడ మండలం కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ స్కూలు ముందు మిషన్ భగీరథ పై లైన్ పగిలి రోడ్డుపై నీళ్లు ఏరులపాడుతున్నాయి ఒకపక్క నీళ్లు లేక గ్రామాలలో అల్లాడిపోతున్నామంటే ప్రజలు ఇక్కడ మాత్రం వృధాగా నీళ్లు రోడ్డుపై పోవడం చూసి స్థానికులు మండిపడుతున్నారు ఇటు విషయాన్నిఅధికారులుగమనించి మన్మత్తులు చేయాలని కోరారు.

**మరిపెడ, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** పలిగిన మిషన్ భగీరథ పైపు లైన్ అనే శీర్షికతో పిసిడబ్ల్యూ న్యూస్ పత్రిక లో బుధవారం నాడు ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. మెయిన్ పైపు లైన్ మరమ్మతులకు అధికారులు స్పందించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ స్కూల్ సమీపంలో ఆదివారం నాడు పగిలిన పైప్ లైన్ కారణంగా నీరు వృథా పోతున్న విషయాన్ని పి సి డబ్ల్యూ న్యూ స్ వెలుగులోకి తీసుకొచ్చింది. మిషన్ భగీరథ అధికారి ఏఈ స్పందించి జేసీబీ సహాయంతో మరమ్మత్తు పనులను శరవేగం గా కొనసాగుతున్నాయి. పలువురు స్థానికులు పి సి డబ్ల్యూ న్యూస్ మండల రిపోర్టర్ తప్పెట్ల సురేష్ ను ప్రశంసించారు.

# రైతన్నలకు పట్టించుకునే నాధుడే కరువు

● విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ● రైతన్నలకు కష్టాలు



**రామడుగు, జూన్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం గుండి సబ్ స్టేషన్ పరిధిలోనీ ఎస్ ఆర్ ఎస్ పి కాలువ పక్కన ఉన్న డి టీ ఆర్ ట్రాన్సార్మర్ గత 15 రోజుల క్రితం కలిపోవడంతో సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తికెళ్ళన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.ప్రస్తుతం నార్లు పోసే మించిపోతున్నదని ఎప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్సర్మర్ ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# కళ్యాణ్ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులపంపిణీ

**గంగాధర, జూన్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం చొప్పదండి మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన 61 మంది కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ లబ్దిదారులకు గౌరవ చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం తన క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శిగా మహమ్మద్ సూఫీయన్ నియామకం




**కరీంనగర్, జూన్14(పిసిడబ్ల్యూ న్యూస్):** యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శిగా హౌసింగ్ బోర్డు డివిజన్ నెంబర్ 7 కు చెందిన మహమ్మద్ సూఫీయాన్‌ను నియమించినట్లు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ కరీంనగర్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ ఉత్తర్వులు జారీ చేశారు.. కరీంనగర్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.. ఈ సందర్భంగా సుఫియన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పథకాలు ప్రజల్లో తీసుకువెళ్తనని యూత్ కాంగ్రెస్ బలోపేతం కోసం తన వంతు సాయి శక్తుల కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి, మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే %ఽ% జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ,జిల్లా యువజన అధ్యక్షులు పడాల రాహుల్ ,కరీంనగర్ పార్లమెంట్ ఇన్చార్జ్ సయ్యద్ ఖాలిద్ అహ్మద్ కు,టిపిసిసి అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావు , నగర్ కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ,07 దివిజన్ కార్పొరేటర్ ఆకుల పద్మ - ప్రకాష్ యూత్ కాంగ్రెస్స్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మహమ్మద్ అమీర్ ,అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రైవేట్ స్కూల్స్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి

● ఎస్ఎఫ్ఐ భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ



**మంథని, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్ (ప్రతినిధి):** మంథని నియోజకవర్గంకాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఉన్నటువంటి ప్రైవేట్ స్కూల్స్ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ఫ్లెక్సీలు పెడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు స్మరణ పేర్కొన్నారు.అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు పోకుండా క్యాంపెనింగ్ ద్వారా తల్లిదండ్రులకు వెళ్లి వారి రీతిలో మాటలు చెప్పి తల్లిదండ్రులను ఫీజులు కట్టించుకుంటున్నారని ఆరోపించారు. ఫ్లెక్సీలు ఎటు చూసినా రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీ లే వెంటనే ఎంఈఓ డిఈఓ పట్టించుకోని చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమరశీల పోరాటాలు చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరన్ కాటారం మండలం సభ్యుడు ఈశ్వర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్‌లు, పెన్నుల పంపిణీ



**కురవి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని పెద్ద తండా, బంచరాయితండ, బంగారి గూడెం, చౌల్ల తండ గ్రామాలలో ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ తన పుట్టినరోజు సందర్భంగా మండలంలోని ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పెనులను పంపిణీ చేసి గొప్ప మనసు చాటుకున్నారు. పేద కుటుంబమైన విద్యార్థి సంఘాల్లో చురుకుగా పాత్ర పోషిస్తూ గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అంచలంచలుగా ఎదిగి విద్యార్థుల కోసం నిత్యం రాజులేని ఉద్యమాలు పోరాటాలు చేస్తూ ముందుకు సాగుతూ పోరాటాలే కాకుండా సహాయపడటంలో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా పిడీఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ మాట్లాడుతూ..... ప్రభుత్వ పాఠశాలలో విద్యానబ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు భవిష్యత్తులో కూడా నా వంతు సహాయం చేస్తానని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు మంచిగా విద్యను అభ్యసించి తల్లితండ్రుల పేర్లు, ఉపాధ్యాయుల పేర్లు స్కూల్ పేరు నిలబెట్టి మంచి స్థాయికి ఎదగాలని కోరారు. ఈ యొక్క ప్రోత్సాహం అనేది పిల్లల మనసుకి నాటుకొని పోతే వాళ్లు కూడా ఉన్నత స్థాయికి ఎదగడానికి మరియు వాళ్లు కూడా రాబోయే తరానికి సహాయ సహకారాలు అందించాలని ఈ చిన్న చిన్న ప్రోత్సాహకాలను అందించారు. ప్రభుత్వ బడులల్లో చదువుకునే పిల్లలకు ఇలాంటి గైడెన్స్ ఇవ్వడం మూలాన వాళ్లు కూడా ఉన్నత స్థాయికి చేరడానికి మనోధైర్యం ఉంటుందని నా యొక్క అభిప్రాయం. ఈ యొక్క నిరుపేద విద్యార్థులకు గత ఐదు సంవత్సరాల నుండి పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోట్బుక్స్ పెన్నులు సహకారం అందిస్తూనే ఉన్నారు. ఇంతే కాకుండా రాబోయే కాలంలో కూడా ఈ యొక్క పేద విద్యార్థులకు నా సహాయ సహకారాలు తుది శ్వాస వరకు ఉంటుందని తెలిపారు. విజయ్ నాయక్, పెద్ద తండా ప్రధానోపాధ్యాయులు సుధాకర్, బంచరాయితండ ప్రధానోపాధ్యాయులు లత, బంగారి గూడెం ప్రధానోపాధ్యాయులు శ్రీ దేవి, చౌల్ల తండ ప్రధానోపాధ్యాయులు కేవై లత, మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ప్రారంభించాలని వినతి...

**సీరోలు, జూన్14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలం కోత్తూరు(సి) గ్రామ శివారు గుజిలితండాలో పాఠశాల గత పది సంవత్సరాలుగా మూసివేయడం వలన తండాకు చెందిన గిరిజన విద్యార్థులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాఠశాలను పునఃప్రారంభించి, ఉపాధ్యాయుడిని నియమించాలని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రామారావు కు కోత్తూరు (సి) గ్రామానికి చెందిన మలిశెట్టి వేణు వినతిపత్రం ఇచ్చి పాఠశాల ను త్వరగా తెరిపించాలని డిఇఓను కోరారు.



# బిచ్చగాళ్లకు ఒక్క రూపాయి కూడా వేయకండి ?

● ఆహారం, దుస్తులు ,నీరు ,ఈ రూపంలో వారికి అందివ్వండి

● ఇలా చేస్తే బిచ్చగాళ్ళ ముఠాలు విడిపోతాయి




**తొర్రూరు ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మనం తరచూ బస్టాండ్ లో, రైల్వే స్టేషన్లో, దేవాలయాలు, ఇతర రద్దీగా ఉండే ప్రదేశాలు, మార్కెట్ల ముందు ఇలా మనకు ఎన్నో ప్రాంతాలలో బిచ్చగాళ్ళ రూపంలో కనిపిస్తూనే ఉంటారు. వీరంతా అసలు బిచ్చగాళ్ళు కానే కాదని కొందరు మూటలుగా ఏర్పడి చిన్నప్పుడే పిల్లలను తీసుకెళ్లి బిచ్చగాళ్ళుగా తయారు చేస్తున్నారని, కొందరు పెద్దవాళ్లను కూడా వారి ఆర్థిక పరిస్థితిని బట్టి బిచ్చగాళ్ళ రూపంలో కొంతమంది వీరితో వ్యాపారం చేసేందుకు ముఠాలుగా ఏర్పడి బిచ్చగాళ్లకు ఒక నాయకుడిని ఏర్పాటు చేసి వారితో బిక్షాటన చేయిస్తున్నారని కేంద్ర ప్రభుత్వం చేసిన ఒక సర్వేలో తేలింది. కొందరు మహిళలు చంకలో చిన్న పిల్లని ఎత్తుకొని మా పాపకు పాలకు డబ్బులు ఇవ్వండి ,ఆకలిగా ఉంది డబ్బులు ఇవ్వండి అంటూ తిరుగుతూ ఉంటారు వీరంతా. అసలు బిచ్చగాళ్లు కాదు ఒక ముఠాలోని సభ్యులు అందుకే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది బిచ్చగాళ్ళ రూపంలో వచ్చే ఎవరికైనా సరే వికలాంగులమని వస్తున్న వారిలో కూడా ఇది కాకుండా దేవుడి మాలలు వేసుకొని ఆ దుస్తులతో కూడా బిక్షాటన చేసేవారు ఎందరో. అందుకే వారందరికీ డబ్బుల రూపంలో వారికి సహాయం చేయకుండా తినుబండారాల రూపంలో వారికి సహాయం చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు వారు వసూలు చేసిన డబ్బులు బిచ్చగాళ్ళకు ఏమీ ఇయ్యకుండా పస్తులుగా ఉంచుకుంటూ వచ్చిన సొమ్మును ఏర్పాటు చేసుకున్న మూట సభ్యులు తీసుకుంటున్నారు.కొందరు వికలాంగులు ప్యాసింజర్ రైల్లో కాకుండా ఎక్స్ ప్రెస్ రైలులో కూడా మనకు దర్శనమిస్తూనే ఉంటారు. వారు మాత్రం ఉన్నతమైన కుటుంబాలలో ఉన్న వారే వికలాంగులుగా రైళ్లలో అడుక్కోవడం పరిపాటిగా మారిపోయింది. ఇలాంటి బిచ్చగాళ్లకు నగదు రూపంలో ఇవ్వకూడదని బెంగళూరు ,ముంబై ,పూణే, హైదరాబాద్ లో ఎలాంటి బిచ్చగాడికైనా నగదు రూపంలో ఇవ్వకూడదని విభిన్నమైన ఉద్యమం మొదలైంది. **ఈ ఉద్యమం సరైనదే...** ఎవరైనా( ఆడ /మగ/ వృద్ధా/ వికలాంగ/ పిల్లలు) అడుక్కుంటే డబ్బుకు బదులుగా తినుబండారాలు ఇస్తాం కానీ ఈరోజు నుండి అలా చేస్తే అడుక్కునే వారి సంఖ్య తగ్గిపోతుంది .రాష్ట్రస్థాయిలో బిచ్చగాళ్ళ ముఠాలు విడిపోతాయని చిన్నపిల్లల అపారహరణకు గురికాకుండా అపహరణ తగ్గిపోతుంది అని అధికారులు చెప్తున్నారు. నగదు రూపంలో చెల్లించడంతో వాడు తినే వస్తువుల కన్నా అందరు మగవారు పిల్లలు మద్యానికి బానిసలై రైల్వే స్టేషన్, బస్టాండ్లలో తిండి లేక ఆకలితో మనకు కనిపిస్తూనే ఉంటారు. కేంద్ర ప్రభుత్వాల ఆదేశాలను అనుసరించి ప్రతి ఒక్కరు కూడా బిచ్చగాళ్లకు నగదు రూపంలో ఇవ్వకండి. ఇలా చేస్తే ఎంతోమంది చిన్న పిల్లలను కాపాడిన వారం అవుతావని ఒకసారి ఆలోచించండి.

# ఖబర్దార్ కౌశిక్ రెడ్డి బుద్ధి మార్చుకో ఇంకోసారి మా మంత్రి జోలికొస్తే నిన్ను బైట తిరుగనివ్వం

● జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ చైర్మన్ తాజుద్దీన్



**కరీంనగర్ టౌన్, జూన్13(పిసిడబ్ల్యూ న్యూస్):** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మా మంత్రి పొన్నం ప్రభాకర్ పై అసత్యపు ఆరోపణలు చెయ్యడం తగదు ఫ్లై యాష్ లారీ లలో రోజుకీ 50 లక్షలు ముదుతున్నాయి అని పచ్చి అభద్దలు ఆడుతున్నావు రోజు వెల్లె ఫ్లై యాష్ లారీ లలో 50 లక్షల బిస్నేస్ కూడా ఉండదు ఇది పూర్తిగా బదనాం చెయ్యాలనే ఉద్దేశంతో అబ్బధపు ప్రచారం చేయడం మంచిది కాదు ఖబర్దర్ కౌషిక్ మైనార్టీల ఆగ్రహానికి గురి కావద్దని హెచ్చరిస్తూనాను నీవు గతంలో ఎస్టీ మహిళ వద్ద ఎమ్మెల్యే టికెట్ ఇపిస్త అని 3 కొట్లు తీసుకున్నావ్ హుజురాబాద్ నియోజకవర్గము లో చాలా మంది దగ్గర కోర్టు లో జాబ్స్ ఇప్పిస్తా అని లక్షల్లో డబ్బులు తీసుకున్నవ్ నివా అవినీతి ఆరోపణలు చేసేది ఖబడ్దార్ కౌషిక్ బుద్ధి మార్చుకో లేకపోతే జిల్లా లో తిరుగానియ్యం ఇంట్లో కెల్లీ కూడా తిరుగకుంట్ట చేస్తాం ఖబడ్దార్ బిడ్డా..

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రాభివృద్ధి వేగవంతం

● పుంజుకున్న అభివృద్ధి పనులు

● కందుల ఆధ్వర్యంలో దక్షిణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు



**విశాఖపట్నం ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జనసేన,టిడిపి, బిజెపికూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు.శుక్రవారం కృష్ణా గార్డెన్ ప్రాంతంలో డ్రైనేజీ పనులను దగ్గరుండి చేయించారు.అక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని అధికారుల దృష్టికి అక్కడి సమస్యలను తీసుకెళ్లి వెనువెంటనే డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా కందుల నాగరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ ముందు ఉంటానని చెప్పారు. దక్షిణ నియోజకవర్గంలో ఉన్న ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా తాను ఉన్నానంటూ ముందుకు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో వేగవంతంగా అభివృద్ధి పనులు కొనసాగనున్నాయని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో చూడని అభివృద్ధి నేడు చూస్తారని అన్నారు.వైసిపి ఓటమితో ప్రజలు పండగ చేసుకున్నారని ఇక తమ కష్టాలు తీరిపోయాయని భావించారని పేర్కొన్నారు.కొత్త ప్రభుత్వంలో తప్పకుండా ప్రజలకు మంచి జరుగుతుందని వెల్లడించారు.అయితే తాను పదవులతో సంబంధం లేకుండా రాజకీయాలకు అతీతంగా పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.కొన్ని కార్యక్రమాలకు తన సొంత నిధులను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.అందరూ బాగుండాలి అందులో మనము కూడా ఉండాలి ప్రజాసేవే మానవ సేవ అనే దృక్పథంతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలోపే ఈ రవికుమార్ , శానిటైజర్ ఇన్స్పెక్టర్ కామేష్ రెడ్డి , అండర్ గ్రౌండ్ సూపర్వైజర్ జీవన్ , సూపర్వైజర్ సురేష్ , వర, శ్రీదేవి , భారతి , కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కర్ర విరిగితే కాటికి పోవాల్సిందేనా...?

- రైతులను, మూగ జీవాలను చంపేస్తారా విద్యుత్ అధికారులు ?
- కంటాయపాలెం రైతులారా జర జాగ్రత్త ?





**తొర్రూరు ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** అసలే వర్షాకాలం, దుక్కులు దున్ని వడ్లు అలికే సమయం ఇది. వర్షాకాలంలో వచ్చే గాలి దుమారాలకు భారీ వృక్షాలే నేల మట్టమవుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు బదులుగా వ్యవసాయ భూమి మధ్యలో మామూలు కర్రను ఏర్పాటు చేసి దానికి మరో కర్రను సపోర్ట్ గా పెట్టి రహదారి అవతలి పక్కనుండి ు రహదారి ఇవతలి వైపుకు నమిలి నారా చెట్లు నరికి విద్యుత్ లైన్ బిగించారు. రైతు దుక్కి దున్నే సమయంలో కర్ర విరిగితే ఏమవుతుందో అర్థం చేసుకోండి. ఇదంతా లైన్మెన్ చేతివాటమా? అధికారుల నిర్లక్ష్యమా అంటున్నారు ఆ ప్రాంత రైతులు ? మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని కంటాయపాలెం గ్రామ శివారులో గుర్తురు నుండి మడీపల్లి కి వెళ్లే రహదారి కస్మా తండాకు అతి సమీపంలో ఈ దృశ్యాలు మీకు కనపడతాయి. పచ్చని చెట్లను నరికి విద్యుత్ లైన్ బిగించేందుకు అటవీ శాఖ అనుమతులు ఉన్నాయా ?. ప్రతినిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఎన్నో పశువులు విద్యుత్ లైన్ కు బలి అవుతూనే ఉన్నాయి. విద్యుత్ అధికారులకు ఇంత నిర్లక్ష్యం ఎందుకు అని రైతులు కానీ మూగజీవాలు కానీ వీరికి శత్రువులా కనిపిస్తామా అంటున్నారు గ్రామస్తులు.? రైతులు దుక్కులు దున్నకముందే విద్యుత్ అధికారులు స్పందించి వైర్ కు ఏర్పాటు చేసిన కర్రను తొలగించి విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ఎవరికైనా అనుకోని సంఘటనలు జరిగితే ఆందోళన చేపడతామని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఐఎన్‌టియుసి నుండిబి ఎంఎస్ సొంతగూటికి చేరుకున్న సెక్రెటరీ జీ .వై .ప్రదీప్ కుమార్

- కాసిపేట టు గనిలో ఐఎన్‌టియుసి యూనియన్‌కి భారీ షాక్




**కాసిపేట, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా గాని కాసిపేట మండలంలోని కాసిపేట 2 గనిలో ఐఎన్టియుసి యూనియన్ నుండి సొంతగూటికి చేరుకున్న మాజీ బి ఎం ఎస్ మందమర్రి ఏరియా సెక్రెటరీ జీ వై ప్రదీప్ కుమార్. ఐ ఎన్ టి యు సి యూనియన్ కి రాజీనామా చేయడంతో కాసిపేట 2 గనికి భారీ షాక్ తగిలినట్లు అయ్యింది. పాత యూనియన్ కి రాజీనామా చేసి సొంతగూటికి చేరుకున్న మాజీ బిఎంఎస్ ఏరియా కార్యదర్శి జీ వై ప్రదీప్ కుమార్ కు పలకపాటి సంతోష్ కండువాను కప్పి యూనియన్ లోకి ఆహ్వానించిన బిఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య వీరితోపాటు ఇతర గనుల నుండి కూడా బిఎంఎస్ యూనియన్ లోకి చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గుర్రం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఇంతకుముందు మందమర్రి ఏరియాలో బిఎంఎస్ యూనియన్ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని కార్మికుల సమస్యలను అందరికీ అందుబాటులో ఉండి వారి సమస్యలను తీరుస్తానని అన్నారు .ఈ కార్యక్రమంలో బి.ఎం.ఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ,సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ అశోక్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ రమేష్, రజనీకాంత్, వెంకటేష్, సంతోష్, పాల్గొన్న వారిలో ఉన్నారు.

## మోరంచవాగు పరిసరాలలో సాగవుతున్న పంటలు వరద ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**గణపురం, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** శుక్రవారం జెన్కో సిఈ, సింగరేణి అధికారులతో కలిసి ఘణపురం మండల పరిధిలోని దుబ్బపల్లి శివారు మోరంచవాగు పరిసరాలు ముంపుకు గురయ్యే పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ గత సంవత్సరం జులై నెలలో వచ్చిన భారీ వర్షాలు కారణంగా మోరంచపల్లి గ్రామం మునిగిపోయి, భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ సంవత్సరం అలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా జెన్కో అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతీ ఏటా ముంపుకు కారణమవుతున్న సమీపంలోని జామాయిల్ తోటను పూర్తిగా తొలగించాలని తెలిపారు. మోరంచవాగులో వెంటనే పూడిక తీత పనులు చేపట్టాలని ఆదేశించారు. మోరంచవాగును శుభ్రపరచాలని అలాగే నీళ్లు వేగంగా వెళ్లేందుకు వాగును వెడల్పు చేయాలని సూచించారు. జెన్కో యాష్ పాండ్ దగ్గర నిర్మించిన కాలువను వెడల్పు చేయాలని, దానికి సంబందించిన పనులకు మంజూరు ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందని వారం రోజులలోగా పనులు ప్రారంభించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల పంట రుణాలు మాఫీ చేసి, కొత్త పంటలకు రుణాలు ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులునల్లపు సుధాకర్




**కురవి, జూన్14(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ముందు నిరసన కార్యక్ర మం శు క్రవారం చేపట్టారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నల్లపు సుధాకర్ మాట్లాడుతూ వ్యవసాయ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినందున రైతులకు ఉన్న పాత రుణాలను మాఫీ చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం కురవి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. రాష్ట్రంలో రైతులకు పంట రుణాలు రెండు లక్షలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఖరీఫ్ సాగు ప్రారంభం అయినందున రైతులకు పెట్టుబడి అవసరాలు వస్తున్నందున పాత రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వకపోతే సాగు చేయలేనిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రుణాలు ఇవ్వాలంటే పాత రుణాలను తక్షణమే మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. రైతులు పంటలు పండించాలంటే చాలా పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని ఎంత పెట్టుబడి పెట్టిన నకిలీ విత్తనాలు నకిలీ పురుగుమం దులు చీడపీడలు అనుకూల వాతావరణ పరిస్థితులు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పెట్టుబడులు వెళ్లక రైతులు ఆత్మలు పెరుగుతున్నాయని అన్నారు.రైతు సంఘం మండల నాయకులు కొండ బత్తుల వెంకన్న, కట్ల కృష్ణయ్య, బత్తిని వీరభద్రం, ఇరుగు సత్యం, దివ్యాంగుల సంఘం నాయకులుబత్తిని వెంకన్న, గూగులోతు బిచ్చ నాయక్, చిలకమ్మా, బానోత్ సునీత, లూనావత్ శంకర్, బానోత్ సాల్కి, శిరసాని రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం 10 గంటలకి బిఓకు తాళం వేసిన పోస్ట్ మెన్




**తొర్రూర్ ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని గుర్తూర్ గ్రామపంచాయతీలో గల పోస్ట్ బి, ఓ కు తాళం వేసి ఉంన్నదని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న బ్రాంచ్ పోస్ట్ కార్యాలయాలు ఉదయం 9 నుండి పగలు ఒంటిగంట వరకు తెరిచి ఉంచాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ మహిళలు కొందరు పోస్ట్ కార్యాలయానికి వెళ్లగా తాళం వేసిన దృశ్యాన్ని చూసి ఆవేదనకు గురయ్యామని అన్నారు. ఈ గ్రామ పోస్ట్ ఆఫీస్ గత రెండు నెలల నుండి అవకతవకలుగా ఉన్నప్పటికీ ఆ సమయంలో మరో బివో అధికారి విధులు నిర్వహించారు. గతంలోనే ఉన్న పోస్ట్ వెంకటేశ్వర్లు గురువారం నుండి చార్జి తీసుకున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. పాతకాలం నాటి తరహా లోని అదే పద్ధతిలో శుక్రవారంఉదయం 10 గంటలకి బి ఓ కు తాళం వేసి ఎటు వెళ్ళాడో తెలియ దని ఇలా అయితే ఇప్పుడు పెన్షన్ వచ్చే సమయంలో ఇలా చేయడం సరికాదని అని అంటున్నారు గ్రామస్తులు. తాళం వేయకుండా చూడాలని గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు.

## అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

- ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేరేల అవగాహన కలిగించాలి
- ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం






**రామడుగు, జూన్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలో మండలపరషత్ కార్యాలయం లో సర్వ సభ్య సమావేశం ఎంపీపీ జవ్వాజి హరీష్ అధ్యక్షాన ఏర్పాటు చేసిన సర్వ సభసమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు మేడిపల్లి సత్యంఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను ప్రజలకు అవగాహన కలిగించి వారికి చేరవేయాలని అన్నారు ప్రవేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేయాలని దానికో సం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2000 కోట్లను మంజూరు చేశారనిఅన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీడీ వో రాజేశ్వరి వైస్ ఎంపీపీ పూరెల్ల గోపాల్ గౌడ్ ఎంపిటిసి ఫోరం అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్ రెడ్డి ,వంచ మహేందర్ రెడ్డి ,మద్ది శ్యామ్ సుందర్ ,మోడి రవీందర్ , తొరికొండ అనీల్,ఎడవల్లి కరుణశ్రీ , కనకం జయ బొమ్మరివేని తిరుమల గుర్రం దేవిక, కొత్త పద్మ పలు శాఖల అధికారులువివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి కరపత్రాలు విడుదల చేసిన డాక్టర్. జహీర్ అహ్మద్



**విశాఖపట్నం ప్రతినిధి, జూన్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి.శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో 16వ తేదీ, ఆదివారం ఉదయం 9 గంటల నుండి వన్ టౌన్ నందు ఉన్న శ్రీ స్వామి వివేకానంద సంస్థ నందు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడును. వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ సి .ఎం .ఎ . జహీర్ అహ్మద్ , పిల్లల డాక్టర్. ముస్తాఫ్ అహ్మద్ కరపత్రాలను విడుదల చేసి, అందరూ కూడా ఈ వైద్య శిబిరంలో పాల్గొనవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ వైద్య శిబిరంలో కంటి గుడ్డి కి సంబంధించిన శస్త్ర చికిత్సలు, అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించబడును, ఎవరికైనా ఆపరేషన్లు పడినచో శంకర్ ఫౌండేషన్ వారే దగ్గరుండి ఆపరేషన్లు చేయించడం జరుగుతుంది. కావున ఈ వైద్య శిబిరాన్ని ఆంధ్ర వినియోగించుకోవాలని సంస్థ అధ్యక్షులు అప్పారావు కోరారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ వై . రాజు మరియు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## టేకుమట్ల తాహాసిల్దార్ ఆఫీస్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

- సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్...



**టేకుమట్ల, 14(పిసిడబ్ల్యూ న్యూస్):** టేకుమట్ల మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడం మూలంగా టేకుమట్ల మండల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు ఆఫ్ డేట్ చేయాలన్న, ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పు గా నమోదు కావడంతో సరి చేసుకొనుటకు ప్రజలు ఇతర మండలాలైన చిట్యాల, మొగుళ్లపల్లి, భూపాలపల్లి కి వెళ్లి అక్కడ పని కాక అనేక ఇబ్బందులు గురవుతున్నారు అన్నారు. టేకుమట్ల మండలానికి ఆధార్ కేంద్రం మంజూరైన ఇప్పటివరకు ప్రారంభించకపోవడం వారి నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారన్నారు తక్షణమే తాహాసిల్దార్ ,జిల్లా కలెక్టర్ స్పందించి టేకుమట్ల మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయని పక్షంలోఆందోళన చేపట్టడం జరుగుతుందని అన్నారు.

## విధి నిర్వహణలో హెూంగార్డ్ నారాయణ స్వామి సేవలు మరువలేనివి

- చిట్యాల సిఐ మల్లేష్ యాదవ్

**చిట్యాల, జూన్ 14(పీసిడబ్ల్యు న్యూస్):** హెూంగార్డ్ పదవీ విరమణ కార్యక్రమంలో సీఐ మల్లేష్ యాదవ్, ప్రజలతో మమేకమై, అధికారుల సమన్వయంతో..విధి నిర్వహణలో భాగంగా అంకితభావంతో ప్రజలకు తమ ఉత్తమ సేవలను అందించిన మొగుళ్ళపల్లి మండల హెూంగార్డ్ నాగంపల్లి నారాయణ స్వామి సేవలు మరువలేనివని చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, మొగుళ్ళపల్లి ఎస్ఐ బి అశోక్ లు కొనియాడారు. గత 30 సంవత్సరముల నుండి హెూంగార్డుగా విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందిన నారాయణస్వామి ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో హెూంగార్డ్ నారాయణ స్వామి దంపతులను పోలీస్ సిబ్బంది, హెూంగార్డుల సంఘం నేతలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో హెూంగార్డుల ఇన్చార్జి..ఆర్ఎస్ఐ సురేందర్ రెడ్డి, ఏఎస్ఐ ప్రకాష్ గౌడ్, హెూంగార్డుల సంఘం స్టేట్ నాయకులు కుమార్, చిర్ర రాజయ్య, రమేష్, హెూంగార్డుల సంఘం జిల్లా ప్రెసిడెంట్ రావుల మొగిలి, హెూంగార్డుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ముత్యాల మొగిలి, మేడిపల్లి శ్రీను, బానోజు సీతారాం నాయక్, గంగరాజు, పెండెల ప్రసాద్‌లు పాల్గొన్నారు.



# జిల్లా రెడ్ క్రాస్ భవన్‌లో ప్రపంచ రక్త దాత దినోత్సవం









**హనుమకొండ ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ రక్త దాత దినోత్సవ పురస్కరించుకొని శుక్రవారం రోజున హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ భవన్ హన్మకొండ లో రెడ్ క్రాస్ పాలకవర్గం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు : సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు. ముందుగా రెడ్ క్రాస్ సొసైటీ లోని, జనరిక్ మందుల షాప్, తలసీమియా సెంటర్ ను సందర్శించి పిల్లలతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. తలసీమియా బాధితులకు పండ్లు పంపిణి చేసినారు. తలసీమియా వ్యాధిగ్రస్తులకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలకు పాలకవర్గాన్ని అభినందించారు. జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు సిక్తా పట్నాయక్, పాలకవర్గం ప్రపంచ రక్త దాత దినోత్సవం పురస్కరించుకొని కార్ల్ ల్యాండ్ స్టినేర్ (రక్త గ్రూప్ లను కనుగొన్న శాస్త్రవేత్త ) చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినారు. జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ రక్తకేంద్రం, తలసీమియా సెంటర్, జనరిక్ మెడికల్ షాప్ నిర్వహణలో రాష్ట్రంలోనే ద్వితయ స్తానంలో ఉంది, కరోనా కాలంలో, వరదలు వచ్చినప్పుడు బాధితులకు నిత్యావసర సరుకులు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ఆదుకున్నారు. అత్యవసర సమయంలో రెడ్ క్రాస్ సేవలు ముందుంటాయి. ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను, రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఆర్గనైజర్లను అబినందించినారు. ఈ సందర్బంగా చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి మాట్లడుతూ.. మానవ శరీరంలోని రక్తం గ్రూపులను కనుగొన్నది కార్ల్ ల్యాండ్ స్టీనర్, అయన 14 జూన్ 1868 జన్మించారని, అయన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచ రక్త దాత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ మాట్లాడుతూ.. బ్లడ్ డొనేషన్ గొప్ప కార్యక్రమం అందరు రక్త దానం చేసి తలసీమియా బాధితుల ప్రాణాలను కాపాడే కార్యక్రమం లో పాల్గొనాలి అన్నారు. పాలకవర్గ సభ్యులు, కన్వీనర్ : పొట్లపల్లి శ్రీనివాస్ రావు స్వాగత ఉపన్యాసం మాట్లాడుతూ.. మానవ జన్మను సార్థకం చేసుకోవాలంటే మనలో నిరంతరం ఉత్పత్తి గల రక్తాన్ని దానం చేయడమే గొప్ప సేవ అని అన్నారు. పాలకవర్గ సభ్యులు, కార్యక్రమం కో-కన్వీనర్ : పుల్లూరు వేణు మాట్లాడుతూ.. రక్తదాతలకు, రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఆర్గనైజర్లకు శుభాకాంక్షలు తెలియచేసినారు. అనంతరం సమాజంలో రక్తదాతలను మోటివేట్ చేసి రక్తదానశిబిరాలను నిర్వహించే వారికీ, ఉత్తమ రక్త దాతలుగా ఎంపికైన వారికీ కలెక్టర్ మరియు పాలకవర్గం చేతులమీదుగా ప్రశంసా పత్రము, షీల్డ్, శాలువాతో సత్కరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు. కలెక్టర్ ని పాలకవర్గం షీల్డ్, శాలువాతో సత్కరించారు. కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ రక్తదాతలకు, రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఆర్గనైజర్లకు ధన్యవాదములు తెలియజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ సిహెచ్ సంధ్యారాణి, బాశెట్టి హరిప్రసాద్, రక్తదాతలు, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆర్గనైజర్స్ మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ



**వరంగల్ ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** శుక్రవారం వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రంగశాయిపేట లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రామ కృష్ణారెడ్డి గారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ శ్రీమతి గుండు చందన పూర్ణచందర్ గారి చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు,స్కూలు యూనిఫామ్స్ అందజేయడం జరిగిందిఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీమతి చందన పూర్ణచందర్ గారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ఈ సంవత్సరం బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు ఎంపికైన చరిత, వర్ష మరియు రాష్ట్రస్థాయి ఖో- ఖో క్రీడలో సిల్వర్ మెడల్ సాధించిన నవ్యశ్రీలను అభినందించారు ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ సూర్యకళ గారు సీనియర్ ఉపాధ్యాయులు కుమారస్వామి సంధ్య శ్రీ, లావణ్య, సుహాసిని సుజాత రాములు సునీత ఉమారాణి అనితశ్రీవాణి కళావతి సాంబయ్య,దేవేందర్ రెడ్డి, పిఈటి గోగు నారాయణ, వనమాచారి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకులు బస్వరాజు పటేల్ 59వ పుట్టిన రోజు




**బీర్కూర్, జూన్ 14 (పీసిడబ్ల్యూ న్యూస్):** బీర్కూర్ మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బస్వరాజు పటేల్ 59 వ పుట్టిన రోజు కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమం లో కాంగ్రెస్ నాయకులు కార్య కర్తలు హాజరయ్యారు.

# ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించాలి

- సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్



**వరంగల్ ప్రతినిధి, జూన్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించాలని సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, ఆర్డీఓ లు కృష్ణవేణి, సిదం దత్తు,పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమీషనర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసిల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పరిష్కరించాలని అన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు. ధరణి వెబ్ సైట్ కు సంబంధించి జిఎల్ ఎం, టిఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసిల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారిస్థాయి లో, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత దరఖాస్తులను ఆయా జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని సిసిఎల్ఏ కమీషనర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని, మార్కెట్ విలువ నమోదులో ఎలాంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లకు రిటర్న్ వచ్చిన దరఖాస్తులలో అధికంగా ఆర్.ఎస్.ఆర్ దరఖాస్తులు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు జత చేయని దరఖాస్తులు ఉంటాయని, ఆర్ఎస్ఆర్ దరఖాస్తులలో తప్పుడు ఎంట్రీ జరిగిందా ధ్రువీకరించి, తప్పుడు ఎంట్రీని తొలగించి, ఆర్ఎస్ఆర్ సవరణకు రిపోర్టుతో సహా నివేదికలు పంపాలని కలెక్టర్లకు సీసీఎల్ ఏ కమీషనర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ అధికారి, తహసిల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరిస్తామని, పెండింగ్ దరఖాస్తులు సత్వర పరిష్కారానికి జిల్లాలోని మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించి దరఖాస్తుల పరిష్కారం వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మండల తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను స్కానింగ్ చేసేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేసుకోవాలని, మండలంలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించేందుకు రోజువారి లక్ష్యాలను కేటాయించుకోవాలని అదనపు కలెక్టర్ మండలాల తహసీల్దార్లను ఈ సందర్భంగా సూచించారు. ధరణి దరఖాస్తులను తిరస్కరించిన సందర్భంలో అందుకు స్పష్టమైన కారణాలు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు స్పష్టంగా అప్ లోడ్ చేయాలని, అలా చేయడం వల్ల ప్రజలకు ఎందుకు దరఖాస్తు తిరస్కరించారనేది అర్థమవుతుందని పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, మండల తహసిల్దారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారిపై అత్యాచారం చేసి హతమార్చిన మానవ మృగం





**సుల్తానాబాద్, జూన్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** అభం శుభం తెలియని చిన్నారిపై ఓ మానవ మృగం అత్యాచారానికి పాల్పడి అనంతరం ఆ చిన్నారిని హతమార్చిన సంఘటన సుల్తానాబాద్ మండలంలో సంచలనం రేపింది.వివరాల్లోకి వెళితే సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులో గల ఓ రైస్ మిల్లులో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా దేహంగామ్ మండలం,గ్రామం కు చెందిన మహేష్-సాలక్క అనే దంపతులకు సంతానం అయినా సహస్ర 6 సంవత్సరములు.గత 15 రోజుల క్రితం కాట్నపల్లి సమీపాన గల రైస్ మిల్లులో నిత్యం కూలీ పనులకు చేరి పనులు నిర్వహిస్తున్నారు.రోజువారీగా గురువారం రాత్రి మిల్లులో పనులు ముగిసిన అనంతరం తమ ఇంటిలో ఉండగా. సాయంకాల సమయంలో విపరీతమైన అకాల గాలి దుమారం,వర్షం వల్ల కలిగిన విద్యుత్ అంతరాయం కారణంగా మహేష్-సాలక్క రాత్రి 9 గంటల వరకు వేచి చూసి అనంతరం ఆరుబయట నిద్రించారు. ఇది గమనించిన బీహార్ కు చెందిన వినోద్ మజ్హి నిద్రిస్తున్న కుటుంబాన్ని పరిశీలించి ఇదే అదునుగా భావించి సహస్ర(6 సంవత్సరాలు) ను అపహరించుకొని పోయి పక్కనే ఉన్న రైస్ మిల్ పొదాల్లో బాలికపై అత్యాచారానికి పాల్పడాడు.అనంతరం బాలికను హత్య చేశాడు.బాలిక తల్లిదండ్రులు తమ కూతురు కనిపించడం లేదని గమనించి వెంటనే రైస్ మిల్లు గుమాస్తా కు సమాచారం అందించి, స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎసిపి గజ్జి కృష్ణ, సిఐ సుబ్బారెడ్డి సర్కిల్ పరిధిలోని పోలీసులు మిల్లు సమీపన పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించడంతో విగత జీవిగా సహస్ర కనిపించింది. విగత జీవిగా సహస్రను చూడడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించారు.సంఘటనా స్థలానికి చేరుకున్న వివిధ పార్టీల నాయకులు ప్రజా సంఘాలు మహిళా సంఘాలు నల్ల మనోహర్ రెడ్డి, బూర్ల సత్యనారాయణ, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు ఉపేక్షించేది లేదని పోస్టు మాస్టర్ గది ముందు, హాస్పిటల్ ముందురోడ్డుపై, అంబేద్కర్ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారి మీద కూర్చొని ధర్నాకు దిగి మిల్లు యజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టి భీష్మయించుకొని కూర్చున్నారు. నిందితుడిని తక్షణమే ఎన్కౌంటర్ చేయాలని ఆందోళన చేపట్టారు.అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతురాలి తల్లిదండ్రులకు అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# పాఠ్య పుస్తకాలు నోటు బుక్స్ పంపిణీ కార్యక్రమంలో మోడల్ స్కూల్ చైర్మన్ తేళ్ల హరిత




**ములుగు జిల్లా, 14 జూన్(పీసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలోని చల్వాయి గ్రామంలో గల మోడల్ స్కూల్లో పాఠ్యపుస్తకాలు మరియు నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమానికి మోడల్ స్కూల్ చైర్మన్ తేళ్ల హరిత గారు హాజరై పాఠ్య పుస్తకాలు మరియు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థులు శ్రద్ధతో మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరడానికి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని కార్పోరేట్ విద్యా కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు కూడా దీటుగా చదువుతారు అని చెప్పి స్కూలుకు మంచి పేరు తీసుకురావాలి వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చెప్పి అన్నారు ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నిజాముద్దీన్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి: సీఐ సత్యనారాయణ గౌడ్




**బీర్కూర్, జూన్ 14(పీసిడబ్ల్యూ న్యూస్):** బీర్కూర్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో జరిగిన శాంతీయుత సమావేశం లో పండుగలు జరుపుకోవాలని రూరల్ సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా మత పెద్దలతో శాంతీ యుత సమావేశం నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పండుగను జరుపుకోవాలని ప్రజలను కోరారు. మతవిద్వేషాలను రెచ్చకొడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుల మతాలకు అందరూ సోదర భావంతో పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. మండలంలో ఏ చిన్న సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు మృతి..

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా లోని లోని గూడూరు మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై తెల్లవారుజామున బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులపై మహబూబాబాద్ నుండి నర్సంపేటకు వెళ్తున్న వెదురు బొంగుల లారీ ఒక్కసారి గా అదుపుతప్పి బీభత్సం సృష్టించి ప్రయాణికుల మీద పడగా అక్కడికక్కడే పాపారావు సీఐ గన్ మెన్ మరియు దేవందర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు చనిపోయారు.. బోల్తా పడ్డ లారీని లేపడానికి స్థానిక పోలీసులు నానా అవస్థలు పడ్డారు వీరు ఇద్దరు కూడా కొద్దిసేపట్లో విధుల్లోకి హాజరయ్యే లోపే ఒక్కసారిగా మృత్యువాత పడడంతో ఒక్కసారిగా గూడూరు మొత్తం ఒక్కసారిగా శోకసముద్రం అలుముకున్నాయి.ఈ సంఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్పీ హుటాహుటిన బయలుదేరి సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ప్రగాఢసానుభూతిని తెలిపారు మృతదేహాలను వెలికి తీసిన అనంతరం గూడూరు మార్చురి కీ తరలించారు.. లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం తోనే ప్రమాదనికి కారణం అయి ఉండొచ్చు అని స్థానికులు చెబుతున్నారు.తదనంతరం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల పోలీసులు మహబూబాబాద్ స్పెషల్ పార్టీకి సంబంధించిన పోలీసులు ఆధ్వర్యంలో అంతక్రియలు నిర్వహించారు.

